

న్యూస్‌రీల్

కేజీబీవీని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్



సిబ్బందికి సూచనలిస్తున్న అదనపు కలెక్టర్..

కాసిపేట: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల, తహసీల్దార్ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ ఆదివారం తనిఖీ చేశారు. కేజీబీవీలో మధ్యాహ్నం విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ధరణి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని సూచించారు. సమస్యలు ఉంటే ఉన్నతాధికారులకు నివేదించి పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ దిలీప్‌కుమార్, డీటీ ప్రసాద్, ఎంఆర్‌ఐ సులోచన, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచొద్దు

దండేపల్లి: ధరణి పోర్టల్ ద్వారా మిస్సింగ్ సర్వే నంబర్లు, విస్తీర్ణ సవరణ, పేర్ల తప్పులు, అసైన్డ్, పట్టాగా మారేందుకు వచ్చిన దరఖాస్తులు పరిశీలించి, పెండింగ్‌లో లేకుండా చూడాలని అదనపు కలెక్టర్ మధుసూధన్‌నాయక్ సూచించారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా దండేపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆదివారం తనిఖీ చేశారు. ధరణి పోర్టల్ ద్వారా వచ్చిన దరఖాస్తుల గురించి ఆరా తీశారు. మొత్తం 175 దరఖాస్తులకు 100 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వాటిని త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు.

ఉద్యోగుల సమస్యలపై మంత్రికి వినతి



మంత్రితో టీఎన్జీవోస్ సభ్యులు

మంచిర్యాలటౌన్: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ నాన్ గజిటెడ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ, న్యాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని కోరారు. జిల్లా కేంద్రంలో ఆదివారం కలిసి వినతిపత్రం ఇచ్చారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. వినతిపత్రం ఇచ్చినవారిలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, కార్యదర్శి రాయకంటి ప్రతాప్, పొన్న మల్లయ్య, శ్రీనివాస్, శ్రావణ్, నాగుల గోపాల్, కుమార్ ఉన్నారు.

కరాటే చాంపియన్‌షిప్‌లో ప్రతిభ



కరాటేలో ప్రతిభ చాటిన విద్యార్థులు

మంచిర్యాలటౌన్: వరంగల్‌లో షితోర్ యూ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 2వ జాతీయ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో మంచిర్యాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబర్చారని కరాటే మాస్టర్ బొల్లంపల్లి శ్రీనివాస్ తెలిపారు. బ్రౌన్ బెల్ట్ స్థాయిలో జె.సుహాస్, జె.విష్ణు, బి.శ్రీవర్ధన్ బంగారు పతకాలను సాధించారని పేర్కొన్నారు. గ్రీన్‌బెల్ట్ స్థాయిలో జి.ఆశిష్, వైట్, బ్లూ బెల్ట్ స్థాయిలో 13 మంది విద్యార్థులు గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించారని వివరించారు.

11న మినీ జాబ్‌మేళా

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ఉపాధి కల్పన కార్యాలయంలో ఈ నెల 11న మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధికల్పన అధికారి కౌశిక వెంకటరమణ తెలిపారు. ఐసీఐసీఐ బ్యాంకులో రిలేషన్‌షిప్ మేనేజర్ ఉద్యోగం కోసం ఇంటర్వ్యూ నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. డిగ్రీ ఉత్తీర్ణులైన 26 ఏళ్లలోపువారు అర్హులని వెల్లడించారు. ఆసక్తి, అర్హత ఉన్నవారు నేరుగా ఉపాధికల్పన కార్యాలయానికి ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

చివరికి.. సేకరణ

- రెండు రోజుల్లో ముగియనున్న ధాన్యం కొనుగోళ్లు
- ఇప్పటికే పలు కేంద్రాల ఎత్తివేత
- నగదు చెల్లింపులో కొనసాగుతున్న జాప్యం



మంచిర్యాల అగ్రికల్చర్: జిల్లాలో ధాన్యం సేకరణ చివరి దశకు చేరుకుంది. కేంద్రాలకు ధాన్యం రాకపోవడంతో కొనుగోలు కేంద్రాలను అధికారులు ఎత్తివేస్తున్నారు. రెండు నెలలుగా ధాన్యం సేకరిస్తుండగా, ప్రస్తుతం 90 శాతం ధాన్యం సేకరణ పూర్తయింది. ప్రస్తుతం కోటపల్లి, చెన్నూర్ మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుంది. ఈనెల 10 వరకే కొనుగోలు కేంద్రాలను కొనసాగించాలని, 15వ తేదీలోగా సేకరించిన ధాన్యం మిల్లులకు తరలించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భారీ వర్షాలతో ఒకటి రెండుసార్లు నారుపోసుకొని ఆలస్యంగా నాట్లు వేయడంతో వరి కోతలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. ప్రస్తుతం వాతావరణంలో మార్పులు మబ్బులు పడుతుండడం, మంచు తీవ్రత పెరగడంతో ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా తేమ 17 శాతానికి లోబడి రావడం లేదు. కొన్ని కేంద్రాల్లో రైతులు ధాన్యం ఆరబోసి మాయిశ్చర్ కోసం ఎదురు చూస్తున్నారు.

45 కేంద్రాల్లోనే సేకరణ..

వానాకాలం సీజన్‌లో జిల్లాలో 1.57 ఎకరాల్లో వరిసాగు చేసుకోగా 3.40 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని, ఇందులో సన్నరకం ధాన్యం రైతుల అవసరాలు, కంపెనీ విత్తనాలు, వ్యాపారుల కొనుగోలు పోను 2.31 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం అమ్మకానికి వస్తుందని అధికారులు అంచనా వేశారు. నవంబర్ 10 నుంచి కొనుగోళ్లు ప్రారంభించారు. దిగుబడికి అనుగుణంగా 244 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఇప్పటి వరకు 148,629.080 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. జన్నారం, దండేపల్లి, హాజీపూర్, మంచిర్యాల నస్పూర్, జైపూర్, భీమారం మండలాల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తికావడంతో 199 కేంద్రాలు ఎత్తివేశారు. చెన్నూర్, కోటపల్లి, వేమనపల్లి మండలాల్లో ప్రస్తుతం ధాన్యం వస్తుండడంతో 45 కేంద్రాలలో సేకరిస్తున్నారు. ఈనెల 15లోగా పూర్తి స్థాయిలో ధాన్యం సేకరించి మిల్లులకు తరలించాలని అధికారుల ఆదేశించారు. అయితే తేమ శాతం అధికంగా ఉంటుండడంతో కొనుగోళ్లు ఆలస్యమయ్యే అవకాశం ఉంది.

అందని నగదు..

జిల్లాలో ఇప్పటి వరకు 24,323 మంది రైతుల నుంచి రూ.306,17,59,048 విలువైన 148,629.080 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. 15,422 మంది రైతుల ధాన్యం సొమ్ము రూ.181,89,54,008 వారి ఖాతాల్లో జమ చేశారు. ఇంకా 8,901 మంది రైతులకు రూ.124,28,05,040 నగదు అందాల్సి ఉంది.

గతేడాదికన్నా మెరుగు..

జిల్లాలో గతేడాది వానాకాలంలో వరిసాగు తగ్గించి పంట మార్పిడి చేసుకోవాలని, సన్నరకం వరి వేయాలని ప్రభుత్వం సూచించడంతో సన్నరకం వరిసాగు ఎక్కువగా చేసుకున్నారు. 1.61 లక్షల ఎకరాల్లో వరిసాగు చేసుకోగా 1.37 లక్షల మెట్రిక్ ధాన్యం సేకరించారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 1.46 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చింది. మరో 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉంది. లక్ష్యం 2.30 లక్షల మెట్రిక్ టన్నులు కాగా, భారీవర్షాలు, చీడపీడలు ఆశించడం దిగుబడి తగ్గడం, సన్నరకాలకు కేంద్రాల్లో గిట్టుబాటు ధర లేక పోవడంతో రైతులు నేరుగా మిల్లింగ్ చేసి బియ్యంగా అమ్మడంతో కొనుగోలు కేంద్రాలకు ఆశించిన మేర ధాన్యం రాలేదు. గతేడాదితో పోల్చితే మాత్రం అధికంగానే విక్రయానికి వచ్చింది.

ఇప్పటి వరకు సేకరించిన ధాన్యం
148,629.080 మెట్రిక్ టన్నులు

రైతులు మొత్తం **24,323** మంది

చెల్లించాల్సిన నగదు
రూ.306,17,59,048

ఇప్పటి వరకు నగదు
అందిన రైతులు **15,422**

రైతుల ఖాతాల్లో జమచేసిన నగదు
రూ.181,89,54,008

ఇంకా నగదు అందాల్సిన రైతులు **8,901**

పెండింగ్ నగదు రూ.**124,28,05,040**

ధాన్యం రావడం లేదు

జిల్లాలో 244 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఇప్పటి వరకు 1.48 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాం. మరో 70 కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయి. ఎక్కువగా చెన్నూర్, కోటపల్లి మండలాల్లో ధాన్యం సేకరణ జరుగుతోంది. ఈనెల 10 వరకు ధాన్యం సేకరణ ముగించాలని అనుకున్నా.. వాతావరణ మార్పులు మంచు ప్రభావంతో తేమ శాతం 30 వస్తుంది. దీంతో సేకరణ ఆలస్యమవుతోంది. – ప్రేంకుమార్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలు, మూత పడ్డవి, సేకరిస్తున్న కేంద్రాలు

ఏజెన్సీ	మొత్తం	మూతపడినవి	సేకరిస్తున్న కేంద్రాలు
డీఆర్డీఏ	54	50	4
పీఏసీఎస్	119	91	28
డీసీఎమ్మెస్	71	58	13
మొత్తం	244	199	45



రక్షణ గోడపై ఆంక్షల నీడ!

- అటవీశాఖ అడ్డంకులతో నాలుగేళ్లగా నిలిచిన పనులు
- ప్రహరీ లేక అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా కాలేజీ
- అనుమతులు ఇప్పించడంలో అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం



జైపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల

జైపూర్: అటవీశాఖ ఆంక్షలతో ప్రభుత్వ కళాశాలకు రక్షణ కరువైంది. కళాశాల చుట్టూ నిర్మించే ప్రహరీ పనులు అటవీశాఖ ఆంక్షలతో నాలుగేళ్లుగా ముందుకు సాగడం లేదు. దీంతో విద్యాలయం.. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోంది. కాలేజీ స్థలం కబ్జా అవుతోంది. సమస్య పరిష్కారానికి చొరవ చూపాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు ఆ విషయాన్ని పట్టించుకోవడం లేదు. అటవీశాఖ అధికారులు ఉద్దేశపూర్వకంగా నిర్మాణ పనులపై ఆంక్షలు విధిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రహరీకి నిధులు మంజూరు కావడానికే ఏళ్లు గడవగా.. వచ్చిన నిధులతో పనులు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా.. నిర్మాణం పూర్తికావడం లేదు.

కళాశాల ప్రారంభం నుంచీ ఆటంకాలే..

జైపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల పుట్టుకే సమస్యలతో మొదలైంది. మొదట స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కళాశాల ప్రారంభించారు. అనంతరం విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వం మండల కేంద్రానికి కిలో మీటర్ దూరంలో 2008లో పక్కా భవనం నిర్మించింది. అటవీ ప్రాంతంలో కళాశాల నిర్మించడంతో బాలికలు ఇబ్బంది పడుతున్నారు. సొంత భవనం నిర్మించినా.. సమస్యలు మాత్రం విద్యార్థులను వెంటాడుతూనే ఉన్నాయి. కళాశాల చుట్టూ కనీసం కాంపౌండ్ లేక రాత్రివేళల్లో మందు బాబులకు అడ్డాగా మారుతోంది. చీకటి పడగానే అసాంఘిక కార్యకలాపాలు సాగుతున్నాయి.

ఏడెకరాల్లో కేజీబీవీకి మూడెకరాలు..

మంచిర్యాల–చెన్నూర్ జాతీయ రహదారి పక్కన ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఏడు ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది. కళాశాల పక్కనే కస్తూరిబాగాంధీ పాఠశాల భవనం నిర్మించేందుకు 3 ఎకరాలు కేటాయించారు. భవన నిర్మాణం పూర్తయింది. కానీ కళాశాల చుట్టూ ప్రహరీ మాత్రం పూర్తి కావడం లేదు. పలుమార్లు విన్నవించిన తర్వాత 2018లో ప్రభుత్వం ప్రహరీ నిర్మాణానికి రూ.30 లక్షలు కేటాయించింది. నిధులు మంజూరు కావడంతో అదే ఏడాది చివరి నెలలో పనులు ప్రారంభించారు. చకచకా నిర్మాణం మొదలు పెట్టడంతో తమ కష్టాలు తీరుతాయని విద్యార్థులు సంబురపడ్డారు.

ఆనందంపై అటవీశాఖ నీళ్లు..

అయితే విద్యార్థుల ఆనందం ఎక్కువ రోజులు నిలవలేదు. అటవీశాఖ అధికారులు వారి ఆశలపై నీళ్లు చల్లారు. మూడు వైపులా ప్రహరీ నిర్మాణం పూర్తి కాగా, మంచిర్యాల–చెన్నూర్ జాతీయ రహదారివైపు పనులు చేపట్టగా అటవీశాఖ భూమిలో నిర్మాణం చేస్తున్నారని ఆశాఖ అధికారులు అడ్డుకున్నారు. ప్రభుత్వ కళాశాల కోసమే ప్రహరీ నిర్మిస్తున్నప్పటికీ అటవీశాఖ అధికారులు బెట్టు వీడకపోవడంతో నాలుగేళ్లుగా నిర్మాణం అసంపూర్తిగానే ఉంది. అనుమతి కోసం అటవీశాఖ అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా ప్రయోజనం లేకుండా పోయింది.

అనుమతి ఇవ్వడం లేదు...



కళాశాల అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం 2018లో ప్రహరీ నిర్మాణానికి రూ.30 లక్షలు మంజూరు చేసింది. మూడు వైపులా నిర్మాణం పూర్తయింది. జాతీయ రహదారివైపు అటవీశాఖ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో పనులు నిలిపివేశారు. ఎన్నిసార్లు సంప్రదించినా అనుమతి ఇవ్వడం లేదు. అటవీశాఖ అధికారులు సమస్యకు పరిష్కారం చూపిస్తే కళాశాల రక్షణ గోడ పూర్తవుతుంది.
– ఎ.వీరస్వామి, జైపూర్ కళాశాల ప్రిన్సిపాల్

అంతర్జాతీయ స్థాయిలో వాసవీ క్లబ్ సేవలు

- కార్యదర్శి ఇరుకుల్ల రామకృష్ణ
- వైభవంగా జిల్లా క్యాబినెట్ ప్రమాణ స్వీకారం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): అంతర్జాతీయ స్థాయిలో అనేక రకాల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ అత్యున్నత సేవలకు వాసవీ క్లబ్ ఇంటర్‌నేషనల్ ఆదర్శంగా నిలుస్తోందని క్లబ్ ప్రధాన కార్యదర్శి ఇరుకుల్ల రామకృష్ణ అన్నారు. హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామంలో వాసవీ క్లబ్ జిల్లా క్యాబినెట్ ప్రమాణ స్వీకార మహోత్సవం జిల్లా గవర్నర్ కొండా చంద్రశేఖర్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. అంతర్జాతీయ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ, వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తూ పోటీ పడుతుండటం అభినందనీయమన్నారు. క్లబ్ సభ్యుల సహకారంతో నిరుపేద విద్యార్థులకు చదువుకునే అవకాశం కలిపించడానికి సరస్వతి పథకాన్ని విస్తృతంగా ముందుకు తీసుకెళ్లడం అభినందనీయమన్నారు. అనేక సేవా కార్యక్రమాలను నిరుపేదల కోసం చేపడుతూ ప్రపంచ వ్యాప్తంగా వాసవీ క్లబ్ సేవలు అందిస్తోందని తెలిపారు. కార్యక్రమాల్లో వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్ కొండ చంద్రశేఖర్, కార్యదర్శి అప్పాల శ్రీధర్, కోశాధికారి అక్కెనపల్లి నాగరాజు, అంతర్జాతీయ వాసవీ క్లబ్ అధికారులు ముక్త శ్రీనివాస్, రేణికుంట్ల శ్రీనివాస్, కటకం హరీశ్, సిరిపురం సత్యనారాయణ, ఆవునూరి శివలీల, పవిత్రం శ్రీనివాస్, ఎక్కిరాల శ్రీనివాస్, కలికోట శ్రీనివాస్, బాల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణం చేస్తున్న క్యాబినెట్ సభ్యులు

భరతమాత ముద్దుబిడ్డలు

వారంతా భరతమాత ముద్దు బిడ్డలే. బతుకు దెరువు కోసం కొందరు.. ఉన్నత విద్యాభ్యాసం కోసం మరికొందరు.. వ్యాపారం కోసం ఇంకొందరు విదేశీబాట పట్టారు. అక్కడే స్థిరపడ్డారు. 'ఏ దేశమేగినా ఎందుకాలిడినా పొగడరా నీతల్లి భూమి భారతిని' అని నినదించిన కవి రాయప్రోలు సుబ్బారావు మాటలను అక్షరాలా నిజం చేస్తున్నారు. మన జాతి గౌరవాన్ని నిలబెడుతున్నారు. ఏ దేశంలో స్థిరపడినా.. ఏ వృత్తిలో ఉన్నా.. పుట్టిన గడ్డపై మమకారం చాటుతున్నారు. తాము సంపాదించిన దాంట్లో కొంత తమ ఉన్నతికి కారణమైన సొంతూరు అభివృద్ధికి వెచ్చిస్తున్నారు. సర్కారు బడికి చేయూతనిస్తూ.. పేద విద్యార్థుల చదువుకు ప్రోత్సాహం అందిస్తున్నారు. సోమవారం ప్రవాసీ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన పలువురు ఎన్నారైలు అందిస్తున్న సహకారంపై ప్రత్యేక కథనం.

- వివరాలు 8లో▸

అందరి కళ్లల్లో వెలుగు



కంటి వెలుగు ప్రచార పోస్టర్లను విడుదల చేస్తున్న మంత్రి, కలెక్టర్, ఎమ్మెల్యేలు

- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి
- కంటివెలుగు కార్యక్రమంపై అధికారులతో సమీక్ష

మంచిర్యాలటౌన్: తెలంగాణ ప్రజల కళ్లలో వెలుగు నింపాలన్న లక్ష్యంతో ప్రభుత్వం రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించిందని దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. అందరికీ కంటి పరీక్షలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంపై ఆదివారం సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ విప్ బాల్క సుమన్, కలెక్టర్ భారతి హోళ్లికేరి, మంచిర్యాల, బెల్లంపల్లి ఎమ్మెల్యేలు నడిపెల్లి దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం గతంలోనే కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించిందన్నారు. ఈనెల 18 నుంచి 100 రోజులపాటు రెండో విడత కార్యక్రమం నిర్వహిస్తుందని తెలిపారు. వారంలో సోమవారం నుంచి శుక్రవారం వరకు క్యాంపులు నిర్వహిస్తారని పేర్కొన్నారు. సెలవు రోజులు మినహాయించి నిర్వహించే శిబిరాలకు ప్రజలంతా వచ్చేలా ప్రజాప్రతినిధులు చూడాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 40 టీంలను ఏర్పాటు చేశారని, ఒక్కో గ్రామపంచాయతీ, మున్సిపల్ వార్డుల్లో రెండు నుంచి మూడు రోజులు నిర్వహించే క్యాంపును ప్రజలందరూ సద్వినియోగం చేసుకునేలా చూడాలని తెలిపారు. క్యాంపు వద్ద వసతులు కల్పించాలని సూచించారు. ఈ నెల 12వ తేదీలోగా అన్ని మండల పరిషత్, మున్సిపాలిటీల్లో కంటి వెలుగుపై సమావేశాలు నిర్వహించాలని, శిబిరాలపై క్షేత్రస్థాయిలో పెద్ద ఎత్తున ప్రచారం చేయాలన్నారు. కంటిచూపు సరిగా లేక సమస్య ఎదుర్కొంటున్న వారు శిబిరానికి రాలేకపోతే.. వైద్యులే వారివద్దకు వెళ్లి పరీక్షలు చేసి, అవసరమైన వారికి కంటి అద్దాలు ఇవ్వాలన్నారు. శస్త్ర చికిత్స అవసరం ఉన్న వారికి కంటివెలుగు కార్యక్రమం తరువాత ఒక తేదీ నిర్ణయించి ఆపరేషన్లు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన వారికీ కంటి వెలుగు ద్వారా పరీక్షలు చేసే ప్రయత్నం చేస్తామన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, వార్డు కౌన్సిలర్లు, ఎంపీపీలు, మున్సిపల్ చైర్మన్లు వారి పరిధిలోని ప్రజలు కంటివెలుగును సద్వినియోగం చేసుకునేలా చూడాలని వివరించారు.

కంటి సమస్య లేకుండా..

ప్రజల సౌకర్యార్థం జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో ప్రభుత్వ ఆసుపత్రులు పని చేస్తున్నాయని, ఉమ్మడి జిల్లాకు 255 మంది వైద్యులను నియమించడం జరిగిందని మంత్రి ఐకే.రెడ్డి తెలిపారు. ప్రతీ ప్రభుత్వ ఆసుపత్రిలోనూ వైద్యులు అందుబాటులో ఉంటారన్నారు.


- ప్రభుత్వ విప్ బాల్కసుమన్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజలందరూ కంటి సమస్య లేకుండా ఉండేందుకే ప్రభుత్వం కంటివెలుగుకు శ్రీకారం చుట్టిందన్నారు. వంద రోజుల్లోనే పరీక్షలు నిర్వహించేందుకు రూ.200 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 40 వైద్య బృందాలతో 484 శిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు.
- కలెక్టర్ భారతిహోళ్లికేరి మాట్లాడుతూ రెండో విడత కంటి వెలుగును విజయవంతం చేసేందుకు వైద్య ఆరోగ్యశాఖ ద్వారా ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. 40 వైద్య బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వారంలో ఐదు రోజులు వైద్య శిబిరాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. గ్రామాల్లో రోజుకు 300 మందికి, పట్టణ ప్రాంతాల్లో 400 మందికి పరీక్షలు చేస్తారని చెప్పారు.

కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, అదనపు కలెక్టర్ రాహుల్, డీసీఎంఎస్ చైర్మన్ లింగయ్య, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుబ్బరాయుడు, మంచిర్యాల, లక్సెట్టిపేట్, నస్పూర్ మున్సిపల్ చైర్మన్లు పెంట రాజయ్య, నల్మాసు కాంతయ్య, ప్రభాకర్, జెడ్పీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, గ్రంథాలయ చైర్మన్ ప్రవీణ్ పాల్గొన్నారు.

ఐబీ ఆవరణలో ఎంసీహెచ్ నిర్మించాలి

- మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్: గోదావరి వరద ముంపు ప్రాంతంలో నిర్మించిన మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని పట్టణంలోని ఐబీ ఆవరణలో పునర్నిర్మించాలని మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు డిమాండ్ చేశారు. ఐబీ ఆవరణలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డు పనులను ఆదివారం పరిశీలించారు. అనంతరం డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖతో కలిసి ఐబీ ఆవరణలో మాట్లాడారు. గోదావరి నది ఒడ్డున ఎంసీహెచ్ భవనం నిర్మించొద్దని ప్రజలు కోరినా వినకుండా, కొందరి భూములకు డిమాండ్ పెరగాలనే ఉద్దేశంతో ముంపు ప్రాంతంలో నిర్మించారని తెలిపారు. దీంతో భవనం వరద నీటిలో మునిగిపోయిందన్నారు. తాము ఎన్నోసార్లు ఎంసీహెచ్ నిర్మాణంపై అభ్యంతరాలు చెప్పినా పట్టించుకోలేదని పేర్కొన్నారు. వరదలో మునిగిన ఎంసీహెచ్‌లో వైద్య సేవల పునరుద్ధరణకు ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. ఈ ప్రాంత ప్రజలు కోరినట్లుగా ఐబీ ఆవరణలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు నిలిపివేసి ఎంసీహెచ్‌ను నిర్మించాలని డిమాండ్ చేశారు. నిర్మించని పక్షంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులను అడ్డుకుంటామని, నిరాహారదీక్ష చేస్తామని హెచ్చరించారు. ఐబీ ఆవరణలో ఎంసీహెచ్ నిర్మిస్తే ప్రజలకు రవాణా భారం తగ్గడంతోపాటు, రెండు ఆసుపత్రులు ఎదురెదురుగా ఉండి ప్రజలకు అనుకూలంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిట్ల సత్యనారాయణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రావుల ఉప్పలయ్య, డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు సంజీవ్, మాజీద్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు రామగిరి బానేశ్, యువజన నియోజకవర్గ అధ్యక్షుడు సల్ల మహేశ్, ఆర్జీపీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వడ్డే రాజమౌళి, ఎంపీటీసీలు దేగ బాపు, ముత్యాల శ్రీనివాస్, నస్పూర్ పట్టణ అధ్యక్షుడు బండారి సుధాకర్, అక్కల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మునిగిన ఎంసీహెచ్ భవనం ఫొటోలతో నేతలు

క్లుప్తంగా

పోరాటాలతోనే కార్మికుల సమస్యలు పరిష్కారం


మాట్లాడుతున్న నాయకులు

బెల్లంపల్లిరూరల్: పోరాటాలతోనే కార్మికుల సమస్యలు పరిష్కారమవుతాయని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఇఫ్టూ), ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు డి.బ్రహ్మనందం, టి.శ్రీనివాస్ అన్నారు. ఆదివారం సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఇఫ్టూ) బెల్లంపల్లి రీజియన్ 10వ మహాసభను బెల్లంపల్లిలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని తిలక్ స్టేడియంలో ఏర్పాటు చేసిన మహాసభకు వారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థలో కాంట్రాక్టు కార్మికుల సమస్యలను యాజమాన్యం గాలికి వదిలేస్తోందన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వకుండా కాంట్రాక్టు కార్మికులను వెట్టిచాకిరీ చేయిస్తూ శ్రమ దోపిడీకి గురిచేస్తోందని మండిపడ్డారు. సమస్యలపై జాతీయ సంఘాలు తీరని అన్యాయాన్ని మిగులుస్తున్నాయన్నారు. టీజీఎల్‌బీకెఎస్ (ఇఫ్టూ అనుబంధ సంఘం) రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి చాంద్‌పాషా, సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఇ ఫ్టూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్, బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు జాఫర్, కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు మల్లేష్, అప్పారావు, తిరుపతి, పోశం ఉన్నారు.

పోలీసుల అదుపులో అనుమానితులు

పెంచికల్‌పేట్: మండలంలోని కమ్మర్‌గాం గ్రామానికి చెందిన దుర్గం దస్రుబాయి అనే యువతి అనుమానాస్పదంగా మృతిచెందగా నలుగురు అనుమానితులు దుర్గం బూదయ్య, తుకరాం, మర్తిడి గ్రామానికి చెందిన మహేందర్, మెరెగూడ గ్రామానికి చెందిన దేవాజీలను ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ విషయమై ఎస్సై విజయ్‌కుమార్‌ను వివరణ కోరగా విచారణ చేపట్టినట్లు తెలిపారు.

మాతృభూమిపై మమకారంతో..

- ఎన్ఆర్ఐల ఔదార్యం...
- పాఠశాలల అభివృద్ధికి కృషి..
- గ్రామ అభివృద్ధిలో పాలుపంచుకుంటూ
- ఆదర్శంగా సేవలు..
- నేడు ప్రవాసీ దినోత్సవం

ఎక్కడ ఉన్నా... ఏమి చేసిన మాతృభూమిని మరిచిపోలేం. తల్లిలాంటి ఊరుకు ఏదో ఓటి చేయాలనిపిస్తుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ఇతర దేశాల్లో స్థిరపడిన పలువురు ఉన్న ఊరు కోసం తమ చేతనైనా సాయం అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. వారు సంపాదించిన దాంట్లో కొంత స్వగ్రామం కోసం ఖర్చు చేస్తున్నారు. ఇందులో కొందరు పాఠశాలల అభివృద్ధి కోసం పాటుపడుతుండగా మరికొందరు గ్రామ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారు. మరికొందరు విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు సాయం చేస్తూ ముందుకు సాగుతున్న వారి గురించి ప్రవాసీ దివాస్ సందర్భంగా ప్రత్యేక కథనం...

చదువు కోసం..


విరాళం ఇస్తున్న మనోహర్‌సరోజ దంపతులు(ఫైల్)


ప్రశాంత్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, అమెరికా

మామడ: మామడ మండలంలోని పొన్కల్ గ్రామానికి చెందిన పరికిపండ్ల మనోహర్ సరోజల కుమారుడు పరికిపండ్ల ప్రశాంత్ ఇంజినీరింగ్ పూర్తిచేసుకుని ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఏడేళ్ల క్రితం అమెరికా వెళ్లాడు. అక్కడే ఉన్నత విద్య పూర్తి చేసిన అనంతరం అమెరికాలోనే స్థిరపడ్డాడు. చికాగో రాష్ట్రంలో సాఫ్ట్‌వేర్ రంగంలోకి ప్రవేశించి స్వంతగా వ్యాపారం ప్రారంభించి ఆర్థికంగా నిలదొక్కుకున్నాడు.

పాఠశాలపై ఔదార్యం...
ప్రశాంత్ స్వగ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో దాదాపు 600మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పాఠశాలలో ల్యాబ్ సౌకర్యం కోసం రూ.1.20లక్షలు విరాళంగా తన తల్లిదండ్రుల ద్వారా అందించాడు.

చదువునేర్పిన గురువుపై మమకారంతో...
ఎన్ఆర్ఐ పరికిపండ్ల ప్రశాంత్ తనకు విద్యాబుద్ధులు నేర్పిన గురువుపై అభిమానంతో గురువు పనిచేస్తున్న పాఠశాలకు రూ.లక్ష విరాళం అందించి తన ఔదర్యం చాటుకున్నాడు. తనకు పాఠశాల స్థాయిలో విద్యను అందించిన గురువు ఉమేష్‌రావ్ ఆదిలాబాద్ జిల్లాలోని బోథ్ మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నట్లు తెలుసుకుని ఆ పాఠశాల అభివృద్ధి కోసం తనవంతుగా సాయం అందించాడు.

పుట్టిన ఊరు రుణం తీర్చుకున్న నందుకుమార్


బజార్‌హత్నూర్‌లో శివాజీ విగ్రహం


చట్ల నందుకుమార్

బజార్‌హత్నూర్: మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ చట్ల లింగన్న చిన్న కుమారుడు చట్ల నందుకుమార్ 20ఏళ్లుగా కుటుంబంతో కలిసి అమెరికాలోని అట్లాంటాలో ఉంటున్నారు. మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో రూ.5లక్షలు ఖర్చు చేసి శివాజీ విగ్రహం ఏర్పాటు చేయించాడు. మండల కేంద్రంలోని శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాలలో రూ.5లక్షలతో మరుగుదొడ్లు నిర్మిస్తున్నాడు. మహదేవుని మందిరం ఆవరణలో రూ.2 లక్షలతో రెండు గదులు నిర్మించాడు.

కష్టాల్లోంచి గట్టెక్కి.. అమెరికాలో స్థిరపడి

చెన్నూర్: చిన్నప్పటి నుంచి ఎన్నో కష్టాలు పడి విద్యాభ్యాసం చేశాడు. తండ్రి మురికి దాసయ్య ఆరోగ్యం బాగాలేకపోవడంతో తల్లి కష్టపడి చదివించింది. తల్లి కష్టాన్ని వృథా చేయకుండా ఉన్నత చదువులు చదివి నేడు అమెరికాలో స్థిరపడ్డాడు. అయినా ఉన్న ఊరు, పడిన కష్టాన్ని మరిపోలేదు. వేణుగోపాల్ నిరుపేదల కష్టాలను గుర్తించి తొచిన సహాయాన్ని అందిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. గత ఏడాది మంచిర్యాల పట్టణానికి చెందిన 50మంది దివ్యాంగులకు ట్రైసైకిళ్లను అందజేశారు. ఇటీవల చెన్నూర్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చి విద్యాభ్యాసం చేస్తున్న 25మంది పేద విద్యార్థులకు రూ.1.65లక్షలతో సైకిళ్లను అందజేసి ఉదారతను చాటుకున్నాడు.


మంచిర్యాలలో దివ్యాంగులకు ట్రైసైకిళ్లు అందిస్తున్న ఎన్ఆర్ఐ వేణుగోపాల్

మరిన్ని సేవా కార్యక్రమాలు..



రానున్న రోజుల్లో మరిని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తా. పేదలకు నా వంతు కొంత సాయం అందిస్తా. మా తల్లి సుశీలతో పాటు కుటుంబ సభ్యులు ప్రొత్సాహం ఉంది. ప్రతి ఏటా కొంత మంది నిరుపేదలకు తన వంతు సహాయాన్ని అందిస్తా.

–మురికి వేణుగోపాల్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్

పిల్లలు చదువు కోసం..


హరీష్‌రెడ్డి

తాంసి: తాంసి మండలంలోని పొన్నారి గ్రామానికి చెందిన ఆనంద్‌రెడ్డి జ్యోతి దంపతుల కుమారుడు హరీష్‌రెడ్డి స్థానిక పాఠశాలలో 9వ తరగతి వరకు చదువుకున్నాడు. 2016లో ఉద్యోగ రీత్యా అమెరికాకు వెళ్లి అక్కడే స్థిరపడ్డాడు. తనవంతుగా గ్రామానికి సాయం చేయాలని నిర్ణయించుకున్నాడు. తన గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థుల కోసం హరీష్ రెడ్డి గ్రామంలో డిగ్రీ పూర్తిచేసుకున్న యువతిని పాఠాలు బోధించడానికి నియమించాడు. సదరు యువతికి నెలకు రూ.5వేలు జీతంగా పంపిస్తున్నాడు.


ఆనంద్‌రెడ్డి ద్వారా వలంటీర్‌కు వేతనం అందిస్తూ..

మాతృభూమిపై ప్రేమతో..


పన్నెల జనార్దన్, గేట్స్ అధ్యక్షుడు

ఖానాపూర్: మండలంలోని సింగాపూర్‌కు చెందిన పన్నెల జనార్దన్ అమెరికాలోని అట్లాంటాలో స్థిరపడ్డాడు. తెలంగాణ పునర్నిర్మాణంలో వారిని భాగస్వాములను చేసే దిశలో ప్రారంభమైన గ్రేటర్ అట్లాంటా తెలంగాణ సొసైటీ(గేట్స్)లో సభ్యుడిస్థాయి నుంచి అధ్యక్షుడిగా ఎదిగారు. 2012లో ఓ గాయకుడిగా సంస్థకు పరిచయమై సంస్థలో జరుగుతున్న ప్రతీ కార్యక్రమంలో తన వంతు సేవలను దశాబ్దానికి పైగా అందిస్తున్నారు. 2022లో ఉపాధ్యక్షుడిగా రాణించి సంస్థకు చేసి 2023లో అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. అలాగే నిర్మల్ జిల్లా కేంద్రంలోని కొండాపూర్‌లో మానసిక వికలాంగుల కోసం సేవా కేంద్రాన్ని ప్రారంభించాడు. అమెరికాలో రిహబులిటేషన్ సైకాలజిస్ట్‌గా పనిచేస్తున్నాడు.


స్వగ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు దుస్తులు అందిస్తున్న జనార్దన్

గల్ఫ్ కార్మికులకు చేయూత


దుబాయిలో రసమయికి గల్ఫ్ కార్మికుల సమస్యలు విన్నవిస్తున్న కృష్ణ (ఫైల్)

ఖానాపూర్: గల్ఫ్ దేశాల్లోని తెలంగాణ కార్మికులైన ప్రవాసభారతీయుల సంక్షేమం కోసం గత పదేళ్లుగా మస్కాపూర్ నివాసి ఎన్ఆర్ఐ దొనికెని కృష్ణ కృషి చేస్తున్నాడు. గల్ఫ్ జైళ్లలో మగ్గుతున్న కార్మికులను స్వదేశాలకు పంపిస్తూ సహకారం అందిస్తున్నాడు. అనివార్య కారణాలతో గల్ఫ్ దేశాల్లో చనిపోయిన వారి మృత దేహాలను కుటుంబాలకు చేర్పుతున్నాడు. ఇందుకోసం గల్ఫ్ కార్మికుల అవగాహన వేదిక సంస్థ స్థాపించి దేశవిదేశాల్లో కమిటీలను ఏర్పాటు చేశాడు. ఎన్ఆర్ఐ పాలసీ సాధన కోసం కార్మికులను చైతన్యం చేస్తున్నాడు. ప్రవాస భారతీయులకు కష్టాలు వస్తే ఇండియన్ ఎంబసీకి వెళ్లి వాటి పరిష్కారానికి కృషిచేస్తున్నాడు. అక్రమ కేసుల్లో ఇరుక్కున్న వారి కోసం న్యాయపోరాటాలు చేసి పలు సందర్భాల్లో సఫలీకృతుడయ్యాడు.

ఎన్ఆర్ఐ పాలసీ సాధనే లక్ష్యం



ఎన్ఆర్ఐ పాలసీ సాధన కోసం ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చుకోవాలి. లేకపోతే గల్ఫ్‌కార్మికుల పక్షాన తమ సంఘం ఆధ్వర్యంలో గల్ఫ్‌దేశాలతో పాటు స్వదేశంలోనూ ఆందోళనలు చేపడుతాం.

– దొనికెని కృష్ణ, గల్ఫ్ కార్మికుల అవగాహన వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు

26 నుంచి హాత్‌సే హాత్ జోడో యాత్ర

మంచిర్యాలటౌన్: రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రకు మద్దతుగా ఈ నెల 26 నుంచి హాత్‌సే హాత్ జోడో అభియాన్ యాత్ర నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పద్మనాయక ఫంక్షన్‌హాల్‌లో కాంగ్రెస్ నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జోడో యాత్రలో ప్రతీ కార్యకర్త పాల్గొని జయప్రదం చేయాలన్నారు. మళ్లీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రజలకు అందించే సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. కార్యక్రమంలో మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరు నియోజకవర్గాల నాయకులు పాల్గొన్నారు.

'అమ్మ' దర్శనానికి బారులు

తెలంగాణ- మహారాష్ట్ర సరిహద్దులోని కెరమెరి మండలం మహరాజ్‌గూడ గ్రామ సమీపంలో కొలువుదీరిన జంగుబాయి క్షేత్రంలో ఆధ్యాత్మికత శోభ సంతరించుకుంది. ఆదివారం భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. తెలంగాణలోని ఆదివాసీలే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక, ఒరిస్సా, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లకు చెందిన భక్తులు భారీగా తరలివచ్చారు. దీంతో అమ్మవారిక్షేత్రం జనసంద్రంగా మారింది. అలాగే నానాటికి భక్తులు సంఖ్య పెరుగుతోంది. కరోనా మహమ్మారి కారణంగా 2019, 2021లో ప్రభుత్వం జాతరలకు అనుమతి ఇవ్వలేదు. ఈసారి అలాంటి ఇబ్బందులు లేకపోవడంతో రెండేళ్ల తర్వాత భక్తులు తమతమ ఆచార వ్యవహారాలతో జంగుబాయిని దర్శించుకునేందుకు క్యూ కడుతున్నారు. ఇప్పటి వరకు 172 మేళం, లక్ష మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. ఈసారి తాత్కాలిక సౌకర్యాలు కూడా ప్రభుత్వం కల్పించడంతో భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ జాతర నెల 21 వరకు కొనసాగనుంది.

– కెరమెరి(ఆసిఫాబాద్)


రావుడ్ దేవత వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు


అమ్మ దర్శనానికి వస్తున్న ఆదివాసీలు


సంప్రదాయ వంటకాలు చేస్తున్న మహిళలు


ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు


మైసమ్మకు పూజలు చేస్తున్న భక్తులు


దోలు వాయిస్తున్న అమ్మదర్శనానికి వస్తున్న ఆదివాసీలు


బేటింగ్ అవుతున్న భక్తులు

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి


భీంరావు (ఫైల్)

తిర్యాణి: రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటన మండలంలోని చిన్న అరటిపెల్లి గ్రామశివారులో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై రమేశ్ వివరాల ప్రకారం... మండలంలోని కైరిగూడ గ్రామానికి చెందిన కనక భీంరావు(45) 15వ బెటాలియన్ సత్తుపల్లిలో టీఎస్ఎస్పీ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో కొన్నిరోజుల క్రితం సెలవులపై స్వగ్రామమైన కైరిగూడకు వచ్చి ఆదివారం తిరిగి విధులకు హాజరయ్యేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న క్రమంలో సమ్మక్క గద్దల వద్ద బైక్ అదుపు తప్పి కిందపడింది. దీంతో భీంరావు తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతిచెందాడు. మృతుడి భార్య కనక విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు


సంఘటన స్థలంలో అశోక్


ప్రమాదానికి గురైన కారు

జన్నారం: అతివేగంతో కారు బండరాయిని ఢీకొట్టడంతో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్సై సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం సాయంత్రం హైదరాబాద్ నుంచి సిరికొండకు వెళ్తున్న కారు అతివేగంగా పైడిపెల్లి గ్రామ సమీపంలో బండరాయిని ఢీకొట్టింది. ఈ ఘటనలో కారుపల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఇచ్చోడ మండలం సిరికొండ గ్రామానికి చెందిన ఓరుగంటి వెంకటేష్, పస ప్రవీణ్, వందన అశోక్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్సై సతీష్ సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. ఇందులో వందన అశోక్ పరిస్థితి విషమంగా ఉందని ఎస్సై తెలిపారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

బంజారా దీక్షభూమికి ఆధ్యాత్మిక శోభ


ధర్మ గురువు రామారావు మహారాజ్ విగ్రహం


ప్రేంసింగ్ దీక్ష చేపట్టిన శంకర్‌లొద్ది ప్రాంతం

- నేటి నుంచి మూడురోజుల పాటు జాతర
- 11న దీక్షా దివస్
- వివిధ రాష్ట్రాల నుంచి తరలిరానున్న లంబాడాలు

నార్నూర్: ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలోని కొత్తపల్లి–హెచ్ గ్రామంలో ఉన్న జాతీయ బంజారాల దీక్ష భూమి వద్ద ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఇందులో భాగంగా దీక్ష భూమి వద్ద కొలువు దీరిన జగదాంబదేవి, రాష్ట్రీయ సంత్ మహాన్ తపస్వీ, ధర్మ గురువు రామారావ్ మహారాజ్ మందిరాలను ముస్తాబు చేశారు. దీక్ష గురువు శ్రీ సంత్ ప్రేంసింగ్ మహారాజ్ అధ్యక్షతన ఏటా జనవరి 11న గురుకృపా దినోత్సవం (దీక్షా దివస్) నిర్వహిస్తున్నారు. లంబాడీల కులదైవమైన జగదాంబ దేవి, రాష్ట్రీయ సంత్ మహాన్ తపస్వీ, ధర్మగురువు శ్రీ రామారావ్ మహారాజ్‌లకు బుధవారం ఉదయం 11గంటలకు ప్రత్యేక పూజ, బోగ్ బండారో చేస్తారు. ఉత్సవాలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, తదితర రాష్ట్రాల నుంచి లంబాడీ(బంజారా) భక్తులు అధికసంఖ్యలో తరలిరానున్నారు. నేటి నుంచి మూడురోజుల పాటు జాతర కొనసాగనుంది.

దీక్ష భూమి ఉద్దేశం
నార్నూర్ మండలంలోని కొత్తపల్లి–హెచ్ గ్రామానికి చెందిన ప్రేంసింగ్ మహారాజ్‌కు ఒకరోజు శివుడు కలలో ప్రత్యక్షమై కుమురంభీం జిల్లా కెరమెరి మండలంలోని శంకర్‌లొద్ది వద్ద తపస్సు చేయమని ఆజ్ఞాపించాడు. దీంతో అతను 1978లో దీక్షకు పూనుకున్నాడు. విషయం తెలుసుకున్న మహారాష్ట్రలోని పొరదేవి నుంచి ధర్మగురువు రాష్ట్రీయ సంత్ మహాన్ తపస్వి రామారావ్ 1979 జనవరి 11న ప్రేంసింగ్ వద్దకు వెళ్లి నీవు దీక్ష ఎందుకు చేస్తున్నావు? నీకోరిక ఏమిటని అడగగా విషయం చెప్పాడు. దీంతో అతని భక్తికి మెచ్చిన రామారావ్ మహారాజ్ శిష్యునిగా స్వీకరించాడు. అప్పటి నుంచి ఏటా జనవరి 11న గురుకృపా దినోత్సవం నిర్వహిస్తున్నారు.